సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 18 । ఆగస్టు । 2024



ఉత్సాహంగా స్టేట్‌మీట్

సాఫ్ట్‌బాల్ స్టేట్‌మీట్ ఉత్సాహంగా ప్రారంభమైంది. క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. - 8లో



వైఎస్సార్‌సీపీకి ఓటేశాడని..

వైఎస్సార్ సీపీకి ఓటేశాడని ఓ వ్యక్తిపై కక్ష సాధించారు. ఆ సామాన్యుడి టిఫిన్ దుకాణాన్ని తొలగించారు. - 8లో

అక్టోబర్ 1 నుంచి 3 వరకు కొత్తమ్మ తల్లి ఉత్సవాలు

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మ తల్లి ఉత్సవాలను అక్టోబర్ 1 నుంచి 3వ తేదీ వరకూ మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వాచకచర్ల రాధాకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అందుకు సంబంధించి శాఖాపరమైన ఏర్పాట్లను త్వరలో ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీగా ఎన్నికైన బొత్సకు అభినందన



బొత్స సత్యనారాయణను అభినందిస్తున్న ధర్మాన కృష్ణదాస్, తదితరులు

నరసన్నపేట: ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణను జిల్లాకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు విశాఖలో కలిసి శనివారం అభినందించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్ కుమార్, రెడ్డి శాంతి, పిరియా సాయిరాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు కరిమి రాజేశ్వరరావు పేడాడ తిలక్ అంధవరపు సూరిబాబు తదితరులు కలసి అభినందించారు.

19, 20 తేదీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్



ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ)లో ట్రిపుల్‌ఐటీ యూనివర్సిటీ కోర్సుల్లో మొదటి రెండు విడతల కౌన్సెలింగ్‌లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఈ నెల 19, 20 తేదీల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు విద్యార్థుల మొబైల్‌లకు మెసేజ్‌లు వస్తున్నాయి. 21వ తేదీ నుంచి క్లాస్‌వర్క్ నిర్వహించనున్నారు. మరోపక్క రెండో విడత సీట్లు లభించిన విద్యార్థులు ఈ నెల 12లోపు క్యాంపస్ ట్రాన్స్‌ఫర్లకు దరఖాస్తు చేసుకున్నారు. మూడో విడత కౌన్సెలింగ్ జాబితా విడుదలలో జాప్యం జరుగుతోంది. రాష్ట్రంలో నాలుగు క్యాంపస్‌లకు సంబంధించి ఒక్కో క్యాంపస్‌కు 75 ప్రత్యేక కేటగిరీ సీట్లు కేటాయించారు. ఈ రిజర్వేషన్ సర్టిఫికెట్ల నిజ నిర్ధారణలో జాప్యం జరుగుతోంది.

రెండు విడతల్లో ప్రవేశాలు, క్యాంపస్ ట్రాన్స్‌ఫర్లు పూర్తయ్యాక మూడో జాబితా విడుదల చేయనున్నారు. షెడ్యూల్ మేరకు క్లాస్‌వర్క్ ప్రారంభించనున్నట్లు శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ తెలిపారు.



రిమ్స్‌లో వైద్యుల ఆందోళన



శ్రీకాకుళం రూరల్: జెమ్స్‌లో నిరసన

వైద్య దళం.. ఆగ్రహ గళం



- కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచారాన్ని ఖండిస్తూ జిల్లా వ్యాప్తంగా వైద్యుల నిరసనలు
- ర్యాలీలు, మానవ హారాలతో ఉవ్వెత్తున ఆందోళనలు
- సంఘీభావం తెలిపిన ప్రజాప్రతినిధులు, రాజకీయ, మహిళా, రైతు, కార్మిక సంఘాల నాయకులు
- అన్ని ఆస్పత్రుల్లో నిలిచిపోయిన సాధారణ వైద్య సేవలు
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో అత్యవసర కేసులకు మాత్రమే అందిన వైద్యం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

వైద్య దళమంతా రోడ్డెక్కింది.. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ ఆస్పత్రి సెమినార్ హాల్‌లో ట్రైనీ డాక్టర్‌ను రేప్ చేసి చంపేయడం, దర్యాప్తులో నిర్లక్ష్యం ప్రదర్శించడంపై నిరసన గళం వినిపించింది. నిందితుడిని తక్షణమే ఉరితీయాలని, కేసును త్వరిగతిన పరిష్కరించాలని, వైద్యులకు భద్రత కల్పించాలని వైద్యులంతా ముక్తకంఠంతో కోరారు. అత్యవసరం కాని ఆపరేషన్లు, ఔట్ పేషెంట్ల సేవలను ఒకరోజు పాటు నిలిపివేసి నిరసన తెలియజేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) పిలుపు మేరకు జిల్లా అంతటా వైద్యులు శనివారం తమ సేవలను నిలిపివేశారు. ప్రభుత్వ, ప్రైవేటు అనే తేడా లేకుండా అన్ని వైద్య వర్గాలు సమ్మెలో పాల్గొన్నాయి. అత్యవసర, క్యాజువాలిటీ సేవలు యథావిధిగా నడిచాయి. తప్పనిసరిగా విధులకు హాజరయ్యే వైద్యులు కూడా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సమ్మెలో పాల్గొనలేని వైద్యులు గంటసేపు నిరసన ప్రదర్శన చేశారు.

అన్ని వర్గాల మద్దతు..

జిల్లాలోని అన్ని ఆస్పత్రులు శనివారం సమ్మెను పాటించాయి. పెద్ద సంఖ్యలో వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సులు, కళాశాల, పాఠశాల విద్యార్థులు, మహిళా, రైతు కార్మిక సంఘాల సభ్యులు కూడా నిరసనల్లో పాల్గొని సంఘీభావం తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు సైతం ర్యాలీల్లో పాల్గొని వైద్యుల నిరసనలకు మద్దతు పలికారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఔట్ పేషెంట్ సేవలు నిలిచిపోయాయి. సాధారణ సర్జరీలు ఆగిపోయాయి. ఎమర్జెన్సీ సర్జరీలు ఎప్పటిలాగానే జరిగాయి. వైద్యులతో పాటు వైద్య సిబ్బంది ఊరూరా ప్రదర్శనలు నిర్వహించారు. కొన్నిచోట్ల మానవహారం నిర్వహించి తమ ఆవేదనను తెలియజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన కార్యక్రమాలు నడిచాయి. సమ్మె సమాచారం తెలియని పలువురు రోగులు మాత్రం ఆస్పత్రులకు వచ్చి వెనుదిరిగారు. ఒకేసారి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు ఓపీ సేవలను బంద్ చేయడంతో ఎక్కడికి వెళ్లలేని పరిస్థితిని ఎదుర్కొన్నారు. కాకపోతే, ఎక్కడా రోగుల నుంచి పెద్దగా వ్యతిరేకత కనబడలేదు. పరిస్థితి తెలుసుకుని సర్దుకుపోయిన వైనం కనిపించింది.



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వైద్యులు, వైద్య విద్యార్థుల నిరసన ర్యాలీ



రిమ్స్‌లో ఖాళీగా కనిపిస్తున్న ఓపీ



టెక్కలి రూరల్: ఆందోళన నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



ఎచ్చెర్ల క్యాంపస్: క్షతగాత్రుని వేషధారణతో ర్యాలీ చేస్తున్న పొన్నాడ వైద్యుడు శేషగిరి



కాశీబుగ్గ: మానవహారం నిర్వహించిన వైద్య సిబ్బంది, విద్యార్థులు

రేపటితో ముగియనున్న ఏపీ పీజీ సెట్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ప్రవేశానికి సంబంధించిన ఏపీ పీజీసెట్–2024 కౌన్సెలింగ్‌లో భాగంగా ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈ నెల 19తో ముగియనుంది. ఈ కౌన్సెలింగ్ ద్వారానే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, పరిధిలోని పీజీ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

ఈ నెల 23వ తేదీలోపు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. 24న ఆప్షన్ల మార్పు, 28 సీట్లు, కళాశాలల ప్రకటన ఉంటుంది.

'కక్షిదారులకు మంచి అవకాశం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కోర్టులో సెప్టెంబర్ 14న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ కక్షిదారులకు ఒక మంచి అవకాశమని, జిల్లాలో గల న్యాయమూర్తులందరితో వర్చువల్‌గా సమావేశం ఏర్పాటు చేయనున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ వారి ఆదేశాల మేరకు ఇలా ఏర్పాటు చేస్తున్నామని, రాజీపడదగ్గ క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులను ఎక్కువ చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయమూర్తులు పాల్గొన్నారు.

బడిలో రాజకీయ అలజడి

జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో మరోసారి రాజకీయ జోక్యం కనిపించింది. కూటమి పార్టీ నాయకులు పలుచోట్ల ఆధిక్యం లేకపోయినా ఆధిపత్యం చూపేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. మరికొన్ని చోట్ల ఏకాభిప్రాయం కుదరకపోవడం, కోరం లేకపోవడం వంటి కారణాలతో ఎన్నికలు మళ్లీ వాయిదా పడ్డాయి.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరు జెడ్పీ, చిలకపాలెం జెడ్పీ పాఠశాలల్లో ఎన్నికల ద్వారా కమిటీలు పూర్తిచేశారు. బొంతలకోడూరులో అధికార పార్టీ నాయకులు ఏకపక్షంగా విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చారు. సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు నిబంధనలపై ఎన్నికలు అధికారి, హెచ్‌ఎం శేఖర్‌బాబుకు ఫిర్యాదు చేశారు. ఇబ్రహీంబాద్‌లో మళ్లీ కోరం లేక వాయిదా వేశారు.

రణస్థలం: మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ స్వగ్రామం పాతర్లపల్లిలో టీడీపీకి పట్టులేకపోయినా అధికార దర్పం ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, పోలీసులపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. కానీ వారి ప్రయత్నాలు సఫలం కాలేదు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారు.

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని బెజ్జిపురం–2 ప్రాథమిక పాఠశాల, చిగురుకొత్తపల్లి, గురుగుబిల్లి గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదా వేశారు.

ఇచ్ఛాపురం రూరల్: బాలకృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో టీడీపీ నాయకుల హైడ్రామాతో మళ్లీ ఎస్‌ఎంసీ ఎన్నిక నిలిచిపోయింది.

పోలాకి: ఈదులవలస మోడల్‌స్కూల్‌లో అధికార పార్టీకి అక్కడి ఉపాధ్యాయులు, పోలీసులు కొమ్ముకాశారు. ఉదయం నుంచే సీఐ, ఎస్‌ఐలతో పాటు సిబ్బందిని మోహరించారు.

ఎల్.ఎన్.పేట: మండలంలోని పూశాం జెడ్పీ ఉన్నత పాఠశాల ఎన్నికలకు 7, 8 తరగతుల్లో కోరం లేనందున వాయిదా వేసినట్లు ఎంఈఓ చంద్రమౌళి తెలిపారు.

కోటబొమ్మాళి: దంత యూపీ స్కూల్‌లో ఎస్‌ఎంసీ ఎన్నికను మళ్లీ వాయిదా వేసేందుకు టీడీపీ నాయకులు అన్ని విధాలా ప్రయత్నించారు. హెచ్‌ఎంపై ఒత్తిడి తెచ్చి ఎన్నికను మళ్లీ వాయిదా వేయించారు.

నందిగాం: మండలంలోని పెద్దబాణాపురంలో కూటమి, వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ ఎన్నికను తీసుకోవడంతో ఎన్నిక హోరాహోరీగా సాగింది. నాటకీయ పరిణామాల మధ్య వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే విజయం సాధించారు. కణితూరు ఉన్నత పాఠశాలలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఎస్‌ఎంసీ ఎన్నిక వాయిదా పడింది.

స్వచ్ఛత సాధించాలి మరింత..

నాగావళి మీదుగా నగరంపై వీస్తున్న గాలి మలినాలను మెల్లగా వదిలించుకుంటోంది. ఐదేళ్లు సాగిన యాగ ఫలితంగా కాలుష్య కారకాలను తగ్గించుకుంటూ వాయువు ఆయువు నింపుకుంటోంది. కానీ ఇక్కడితోనే అంతా అయిపోలేదు. ఇంకా మనం ముప్పు ముంగిట్లోనే ఉన్నాం. గత ప్రభుత్వం మొదలుపెట్టిన ఈ స్వచ్ఛతా క్రతువు ఆగిపోతే.. మళ్లీ కాలుష్య రక్కసి జడలు విప్పే ప్రమాదం ఉంది. 'పీఎం టెన్' కణాలను వడకట్టలేకపోతే గుండె నిండా గాలి పీల్చుకునే భాగ్యం దూరమైపోతుంది.

- సిక్కోలులో తగ్గుతున్న కాలుష్యం
- ఫలించిన గత వైఎస్ జగన్ ప్రభుత్వం కృషి
- సత్ఫలితాలు ఇచ్చిన పొల్యూషన్, కార్పొరేషన్, ఆర్టీవో, పోలీసు, వ్యవసాయ శాఖ అధికారుల చర్యలు
- సేఫ్‌జోన్‌లోకి రావాలంటే మరింత తగ్గాల్సిన అవసరం
- దేశంలో 68 పాయింట్లతో 104 స్థానంలో ఉన్న శ్రీకాకుళం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

శ్రీకాకుళం సేఫ్‌జోన్‌లోకి వస్తోంది. జిల్లా కేంద్రంలో వాయు కాలుష్యం తగ్గుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గాలిలో ఉండే 'పీఎం టెన్' కణాల ఆధారంగా ఆ ప్రదేశం కాలుష్యాన్ని నిర్ధారిస్తారు. సాధారణంగా పీఎం టెన్ కణాల స్థాయి గాలిలో 60లోపు ఉంటే వాయు కాలుష్యం ముప్పు తప్పినట్టే. శ్రీకాకుళంలో 2023–24కు గాను చేసిన పరిశీలనలో పీఎం టెన్ కణాల స్థాయి 68 వరకు ఉంది. అంటే మనం ఇంకా ముప్పు ముంగిటలోనే ఉన్నాం. 2019కు ముందు ఈ సంఖ్య 80 వరకు ఉండేది. గత ఐదేళ్లలో వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా అది 2021లో 76, ఆ తర్వాత 72, ఇప్పుడు 68 వరకు తగ్గింది. ఇవే జాగ్రత్తలు పాటించి పీఎం టెన్ కణాల స్థాయి 60లోపు ఉంచగలిగితే మనం నిశ్చింతగా గుండెల నిండా గాలి పీల్చుకోవచ్చు.

తగ్గుముఖం పడుతున్న కాలుష్యం

శ్రీకాకుళంలో వాయు కాలుష్యం తగ్గడానికి గత ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలిచ్చాయి. 2019కి ముందు అధ్వానమైన రోడ్లు, పరిసరాల అపరిశుభ్రత, ట్రాఫిక్ రద్దీ, వాహనాల నుంచి వెలువడే పొగ, కట్టెలు, పిడకలపై ఆధారపడి వంట చేయడం, కోతల తర్వాత పంటల వ్యర్థాలను నేలలో పూడ్చి పెట్టకుండా ఎక్కడికక్కడ తగలబెట్టడం వంటి చర్యలు హరితావరణాన్ని దెబ్బతీశాయి. వైఎస్ జగన్ ప్రభుత్వం రాక ముందు శ్రీకాకుళంలో 80కిపైగా పీఎం 10స్థాయి ఉండేదని లెక్కలు చెబుతున్నాయి. ఇదే స్థాయిలో ఉంటే మన ప్రాణాలకు ముప్పు ఉన్నట్టే. అదృష్టవశాత్తు ప్రజల ప్రాణాలే ముఖ్యమనే లక్ష్యంతో గత ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో ఆ పరిస్థితి నుంచి బయటపడ్డాం. కానీ ఇంకా ముప్పు పొంచి ఉందనే చెప్పాలి.



గత ప్రభుత్వ హయాంలో శ్రీకాకుళంలోని రహదారుల్లో ఆధునిక యంత్రాల వినియోగం

వైఎస్ జగన్ ప్రభుత్వం ఏం చేసిందంటే..

- ఆర్టీఓ, వ్యవసాయ శాఖ, మున్సిపల్ కార్పొరేషన్, పోలీసు శాఖ, కాలుష్య నియంత్రణ మండలి శాఖలను సమన్వయం చేసి కీలక నిర్ణయాలను గత ప్రభుత్వం తీసుకుంది.
- వాయు కాలుష్యానికి కారణమని భావిస్తున్న పలు ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేసింది.
- ముఖ్యంగా నాగావళి నది నుంచి ఎడ్ల బండ్ల ద్వారా ఇసుకను తీసుకొస్తున్నప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఎక్కడికక్కడ ఇసుక ఎగిరిపడేది. ఈ పరిస్థితి లేకుండా చర్యలు తీసుకుంది.
- ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఫ్రీ ఫ్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంది.
- నగరంలోకి ఉదయం 8గంటల నుంచి రాత్రి 9లోపు భారీగా వాహనాలు రాకుండా నియంత్రించింది.
- క్వారీ వాహనాలు టార్పాలిన్స్ వేసి మాత్రమే ప్రయాణించేలా చర్యలు తీసుకుంది.
- కాలం చెల్లిన వాహనాలను సీజ్ చేసేలా, వ్యవసాయ వ్యర్థాలను కాల్చకుండా, వంట చెరకు బదులు గ్యాస్ వినియోగం తెచ్చేలా, పెట్రోల్, డీజిల్ వాహనాలకు బదులు ఎలక్ట్రికల్ వాహనాలు వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టింది.
- శాఖల సమన్వయంతో ప్రజల్ని చైతన్యం పర్చడంలో సక్సెస్ అయింది.

రూ. 3కోట్లకు పైగా అభివృద్ధి పనులు

- నగరంలో అప్పట్లో అధ్వానంగా ఉన్న రహదారుల కారణంగా దుమ్ము ధూళి ఎక్కువవుతుందని వైఎస్ జగన్ ప్రభుత్వం గుర్తించింది.
- ఏడు రోడ్ల జంక్షన్ నుంచి పీఎస్‌ఎన్ సామిల్లు జంక్షన్ వరకు ఉన్న రోడ్డు, పొట్టి శ్రీరాముల జంక్షన్ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే రోడ్డు, కొత్త బ్రిడ్జి నుంచి బైపాస్‌కు వెళ్లే కిమ్స్ రోడ్డు, పాత బ్రిడ్జి నుంచి బైపాస్ జంక్షన్ వరకు ఉన్న పాలిటెక్నిక్ కాలేజ్ రోడ్డును అభివృద్ధి చేసింది.
- ఎండ్ టూ ఎండ్ నిధుల నుంచి రూ. 2.24 కోట్లతో వీటి పునర్నిర్మాణ పనులు చేపట్టింది.
- అలాగే కార్పొరేషన్ నిధుల నుంచి రూ.73లక్షలతో పూడికలు తీసేందుకు మినీ ఎక్స్‌వేటర్, రోడ్లపై ఉన్న ధూళి ఎగరకుండా ఉండేలా తడిపేందుకు స్ప్రింకర్లతో కూడిన వాటర్ ట్యాంక్‌ను, రోడ్లపై ఉన్న దుమ్ము ధూళిని తొలగించే మెకానికల్ స్వీపర్‌ను కొనుగోలు చేసి వినియోగంలోకి తెచ్చింది.

వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో...





శ్రీకాకుళంలో పరిశుభ్రంగా రహదారులు

దేశంలో 104వ స్థానం



వాయు కాలుష్యానికి సంబంధించి 2023–24లో నమోదైన వాతావరణ కాలుష్యం డేటా ప్రకారం దేశ వ్యాప్తంగా 131 పట్టణాల్లో అత్యధిక కాలుష్యం నమోదవుతుండగా వాటిలో ఏపీ నుంచి 13 ప్రాంతాలు ఉన్నాయి. ఇందులో దేశంలోనే శ్రీకాకుళం 104వ స్థానంలో నిలిచింది. ఇక్కడ పీఎం టెన్ కణాల స్థాయి 68గా నమోదైంది. అంటే మన కన్న 27నగరాలే మెరుగైన స్థాయిలో ఉన్నాయని చెప్పాలి. దీన్ని మరింత మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉంది.

ఆధునిక పర్యవేక్షణ..



ఆధునిక యంత్రాలతో పరిశుభ్రత చర్యలు

- ప్రస్తుతానికి శ్రీకాకుళం నగరంలో కార్పొరేషన్ కార్యాలయంపైన, గుజరాతీపేట జిల్లా సహకార అధికారి కార్యాలయం వద్ద, కుశాలపురం వద్ద కాలుష్య మానిటరింగ్ స్టేషన్లు ఉన్నాయి.
- ఇవి కాకుండా రూ. 45లక్షలతో ఆన్‌లైన్ కంప్యూటర్ రీడింగ్ మానిటరింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంది.
- మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేసింది. త్వరలోనే ఆ యూనిట్‌ను అధికారులు ఇన్‌స్టాల్ చేయనున్నారు.
- గత ప్రభుత్వ చొరవతో పాటు కార్పొరేషన్ కమిషనర్ ఓబులేష్, కాలుష్య నియంత్రణ మండలి ప్రస్తుత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.రామారావు నాయుడు, గతంలో పనిచేసిన ఈఈ శంకర్ నాయక్‌తో పాటు ఆర్టీవో, పోలీసు, వ్యవసాయ శాఖల అధికారులు కూడా ఇతోధికంగా కృషి చేశారు.
- ఈ చర్యలను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించగలిగితే కాలుష్యం విషయంలో మన సేఫ్ జోన్‌లోకి వచ్చే అవకాశం ఉంది.



శ్రీకాకుళంలోని కూడళ్ల వద్ద శుభ్రత

క్లుప్తంగా

'ఎన్‌ఎంఎంఎస్ ఒరియాలోనూ నిర్వహించాలి'



దేవానందరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బృందావన్ దొళాయి తదితరులు

కవిటి: నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎం ఎస్) ప్రతిభా పరీక్షను ఒడియా లింగ్విస్టిక్స్ విద్యార్థుల కోసం ఒడియా మీడియంలోనూ ప్రశ్నపత్రం అందించాలని ఏపీ ఒరియా టీచర్స్ అసోసియేషన్(అపోటా) సంఘం ప్రతినిధులు కోరారు. శనివారం శ్రీకాకుళంలో రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానంద రెడ్డిని అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దోళాయి, ఉత్తరాంధ్ర ఒడియా డీఐ దుర్గ ప్రసాద్ చౌదురీ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొళాయి మాట్లాడుతూ ఒరియాలోనూ ప్రశ్న పత్రం ఉంటే ఒరియా విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఒరియాలో అవకాశం లేకపోవడంతో చాలామంది ప్రతిభావంతులైన పిల్లలు అవకాశం కోల్పోతున్నారని తెలిపారు. పేద పిల్లల భవిష్యత్ దృష్ట్యా దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై డైరెక్టర్ దేవానంద రెడ్డి మాట్లాడుతూ అవసరమైన చర్యలు తీసుకుంటానని అన్నారు.

సీఐలకు స్థానచలనం

శ్రీకాకుళం క్రైమ్ : విశాఖ రేంజి పరిధిలో 52 మందికి బదిలీ చేస్తున్నట్లు విశాఖపట్నం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు జిల్లా నుంచి నలుగురు బదిలీపై వెళ్తుండగా నలుగురు ఇక్కడికి వస్తున్నారు. పి.పైడయ్య (టెక్కలి), ఎస్‌హెచ్‌వీ ఆనంద్ (కాశీబుగ్గ అర్బన్), జి.దివాకర్‌వాయు నందన్‌యాదవ్ (ఆమదాలవలస)లు విశాఖ వీఆర్‌కు, చోళంగి వెంకటరావు శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్ నుంచి జి.మాడుగుల (ఏఎస్‌ఆర్ జిల్లా)కు వెళ్తున్నారు. అలాగే ఎ.విజయ్‌కుమార్ నక్కపల్లి (అనకాపల్లి జిల్లా) నుంచి టెక్కలి, దాడి మోహనరావు రాజాం టౌన్ (విజయనగరం) నుంచి కాశీబుగ్గ అర్బన్, పాండ్రంకి సత్యనారాయణ ఎల్విన్‌పేట (పీవీఎం-మన్యం) నుంచి ఆమదాలవలస, బూర ప్రసాదరావు విశాఖ వీఆర్ నుంచి కళింగపట్నం మెరైన్ సీఎస్‌పీఎస్‌కు రానున్నారు.

ఉత్సాహంగా సాఫ్ట్‌బాల్ స్టేట్‌మీట్ ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా 11వ ఏపీ రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్-2024 పోటీలు శనివారం మొదలయ్యాయి. రాష్ట్రం నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. స్టేట్‌మీట్ ప్రారంభోత్సవానికి ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరయ్యారు. కూన రవి మాట్లాడుతూ ఒలింపిక్స్ సాధించిన తర్వాత జనరానాలు ప్రకటిస్తున్నారు తప్పితే క్రీడలకు మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని అన్నారు. మరో ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ కేఆర్ స్టేడియం పనులు త్వరితగతిన పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామన్నారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ మూడు రోజుల స్టేట్‌మీట్ పోటీల వివరాలను, ఏర్పాట్లను వివరించారు. అంతకుముందు బాలికల సాంస్కృతిక నృత్య, కోలాటం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రారంభోత్సవ కార్యక్రమంలో క్రీడాకారులు ప్రదర్శించిన మార్చ్‌పాస్ట్ ఆకట్టుకుంది. అంతకుముందు జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్, క్రీడల సంఘ పతాకాన్ని కలిదిండి నరసింహరాజు ఆవిష్కరించారు. కూన రవికుమార్ లాంఛనంగా పోటీలను ప్రారంభించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్, పక్కనే ఎమ్మెల్యే గొండు, కలిదిండి, అతిథులు, నిర్వాహకులు

ఆతిథ్య జట్లు అదుర్స్..

ఈ స్టేట్‌మీట్‌లో ఆతిథ్య శ్రీకాకుళం జిల్లా జట్లు అదుర్స్ అనిపిస్తున్నాయి. లీగ్‌కమ్ నాకౌట్ పద్ధతిలో జరుగుతున్న ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో సిక్కోలు బాలురు, బాలికలు రెండు జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లాయి. బాలురు విభాగంలో శ్రీకాకుళం, గుంటూరు, విజయనగరం, అనంతపురం, ప్రకాశం, చిత్తూరు, పశ్చిమగోదావరి, విశాఖపట్నం జట్లు క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాలికల విభాగంలో శ్రీకాకుళం, గుంటూరు, ప్రకాశం, విజయనగరం, అనంతపురం జట్లు క్వార్టర్స్‌ఫైనల్స్‌లో ప్రవేశించాయి. మరికొన్ని మ్యాచ్‌ల ఫలితాలను బట్టి 3 జిల్లాల జట్లు క్వార్టర్స్‌కు చేరాల్సి ఉంది.



ఉత్సాహంగా ఆడుతున్న క్రీడాకారులు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

పొందూరు: బాలికల సంరక్షణకు సంబంధించిన చట్టాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం పొందూరు మండల కేంద్రంలో గల బాలికల బీసీ వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటిని సాధించేందుకు శ్రమించాలని అన్నారు. సెల్‌ఫోన్ వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. అలాగే బాలికల చట్టాలను వివరించారు. అనంతరం వసతి గృహం గదులను, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో వార్డెన్ పైడి పద్మావతి, సిబ్బంది ఉన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న

పరిమళించిన మానవత్వం

నరసన్నపేట: తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ యాచకుడిని ఆస్పత్రికి తరలించి పోలీసు సిబ్బంది, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. జమ్ము కూడలి వద్ద ఓ వృద్ధుడు బిచ్చమెత్తుకుంటూ జీవించేవాడు. అయితే శనివారం ఆయన వాంతులు, విరేచనాలతో అచేతన స్థితికి చేరుకున్నాడు. అయిన వాళ్లంటూ ఎవరూ లేకపోవడంతో ఆస్పత్రికి వెళ్లలేక అక్కడే ఇబ్బంది పడ్డారు. శనివారం అటుగా వెళ్లిన నరసన్నపేట పోలీసు కానిస్టేబుళ్లు సూర్యనారాయణ, అప్పారావులు ఆ వృద్ధుడిని గమనించి స్థానిక వీహెచ్‌పీ ప్రతినిధి, స్థానిక కళింగ కోమట్లు సంఘం సభ్యుడు ముచ్చేటి సుధాకర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే 108 వాహనానికి ఫోన్ చేయగా సిబ్బంది వచ్చారు. అక్కడే ప్రాథమిక చికిత్స చేశారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు ఉమామహేశ్వరరావు సాయంతో యాచకుడికి అక్కడే స్నానం చేయించి దుస్తులు మార్చారు. ఆ తర్వాత నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందజేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యాచకుడు

'ఆమోదం లేని వర్గీకరణ తగదు'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): షెడ్యూల్ కులాలను, తెగలను విభజించే అధికారం సుప్రీంకోర్టుకుగానీ, కేంద్రానికి గానీ, రాష్ట్రానికి లేదని దళిత ఐక్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బెంజిమెన్ అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఆదివారంపేట నుంచి ఏడురోడ్ల కూడలి మీదుగా సూర్యమహల్ నుంచి రైతుబజారు జంక్షన్‌లోని అంబేడ్కర్ భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఆదివారంపేట జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. రాజ్యాంగంలో 341 ఆర్టికల్ ప్రకారం పార్లమెంట్ గానీ, రాష్ట్రపతి ఆమోదం లేకుండా ఎస్సీ వర్గీకరణ ఎలా చేస్తారని ప్రశ్నించారు. దళితులకు అన్యాయం చేస్తే ఆయా రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం కన్వీనర్ ఎన్ భరత్‌భూషణ్‌రాజు, ఎస్సీ, ఎస్టీ టీచర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతల దుర్గారావు, రాష్ట్ర నాయకులు డాక్టర్ అంబేడ్కర్, డాక్టర్ గంజి ఎజ్రా, బి. మురళీకృష్ణ, బోనెల అప్పారావు, అంపోలు ప్రతాప్, సంజీవరావు వివిధ మండలాల దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న దళిత సంఘాల నాయకులు

'వర్సిటీ ప్రగతికి సహకరించాలి'



మంత్రి దృష్టికి వర్సిటీ సమస్యలు తీసుకువెళుతున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ప్రగతికి కృషి చేయాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని వీసీ కేఆర్ రజిని, రిజిస్ట్రార్ పి.సుజాత కోరారు. వారు మంత్రిని నిమ్మాడలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం సమస్యలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వర్సిటీలో సమస్యలు, ఆర్థిక పరిస్థితులను వివరించారు.

ఆడిట్ సెల్ ఏర్పాటు

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్‌ఏయూలో శనివారం ఆడిట్ సెల్ ఏర్పాటు చేశారు. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.తారకేశ్వరరావును డైరెక్టర్‌గా నియమించి, వైస్ చాన్స్‌లర్ కేఆర్ రజిని నియామక పత్రం అందజేశారు. సభ్యులుగా డీసీఎంఎస్‌కు చెందిన బోధకులు ప్రకాష్‌బాబు, రాంజీనాయక్, సంతోషి పావని, ఆడిట్ విశ్రాంత ఉద్యోగి రమణలను నియమించారు.

'వలంటీర్లకు న్యాయం చేయాలి'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వలంటీర్లకు న్యాయం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, ఏపీ వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగదీష్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బకాయి పడిన రెండు నెలల గౌరవ వేతనాన్ని మంజూరు చేయించాలని, రాజీనామా చేసిన వలంటీర్లను బలవంతపు రాజీనామాలుగా గుర్తించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ మేరకు నగరంలోని క్రాంతి భవన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. రూ. 10వేలు జీతం ఇస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, స్థానిక వాలంటీర్స్ రాంబాబు, కిషోర్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఉమెన్స్ కళాశాల రోడ్డు మార్గంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. శనివారం ఉదయం సుమారు 11.15 గంటల సమయంలో ఓ వృద్ధుడు మిల్లు జంక్షన్ నుంచి ఉమెన్స్ కళాశాల రోడ్డువైపు వచ్చి డీపీఆర్వో కార్యాలయం వైపు వెళ్లేందుకు మలుపులో తిరుగుతుండగా సూర్యమహల్ నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న ముగ్గురు యువకులు ఢీకొన్నారు. దీంతో వృద్ధునికి గాయాలయ్యాయి. ఈ ముగ్గురు యువకుల్లో మైనర్లు కూడా ఉన్నారు. సమీపంలో ఉన్న స్థానికులు, ఢీకొట్టిన యువకులు వృద్ధుడిని లేపి ముందుగా రిమ్స్‌కు తరలించారు. మెరుగైన చికిత్స కోసం వేరే ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీనిపై ఎలాంటి సమాచారం తమకు అందలేదని ట్రాఫిక్ పోలీసులు చెప్పడం గమనార్హం.

'ప్రైవేటు ఉపాధ్యాయులకూ అవార్డులు ఇవ్వాలి'

శ్రీకాకుళం: ప్రైవేటు స్కూల్స్, కాలేజ్‌లలో పనిచేస్తున్న ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్లకు కూడా టీచర్స్ డే సందర్భంగా బెస్ట్ టీచర్స్ అవార్డులు ఇవ్వాలని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గంగు మన్మధరావు కోరారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యా వ్యవస్థలో అక్షరాస్యతలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వ టీచర్స్, లెక్చరర్స్ కన్నా.. ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ అధికమన్నారు. అందువల్ల తమకు బెస్ట్ టీచర్స్ అవార్డులు ఇవ్వాలన్నారు.

క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్

నందిగాం: మండలంలోని పెద్దినాయుడుపేట జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నై నుంచి కోల్‌కతా కార్లతో వెళ్తున్న లారీ.. మండలంలోని పెద్దినాయుడుపేట వద్దకు వచ్చే సరికి ముందు వెళ్తున్న టామాటా పళ్ల లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ వినోద్‌కుమార్ పాటిక్, క్లీనర్ అంజన్ కుమార్ సింగ్‌లు లారీ క్యాబిన్‌లో చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న జాతీయ రహదారి సిబ్బంది, నందిగాం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్యాబిన్‌లో చిక్కుకున్న క్లీనర్‌ను బయటకు తీశారు. డ్రైవర్‌ను బయటకు తీయడం వీలు కాలేదు. దీంతో రెండు క్రేన్లు తీసుకువచ్చి సుమారు 2 గంటలు కష్టపడి డ్రైవర్‌ను బయటకు తీశారు. క్షతగాత్రులను పలాస ఆస్పత్రికి తరలించగా ప్రథమచికిత్స అనంతరం డ్రైవర్ వినోద్ కుమార్ పాటిక్‌ను మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. క్లీనర్ అంజన్‌కుమార్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టమాటా లోడ్ లారీ డ్రైవర్ సుధాపుర్‌పై నందిగాం ఎస్ఐ మహ్మద్ అమీర్‌ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో లారీ క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్ వినోద్ కుమార్ పాటిక్

వృద్ధురాలిపై కోతుల దాడి

కాశీబుగ్గ: మందస మండలం బెల్లుపటియా గ్రామంలో కోతుల దాడిలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన కొండల సావిత్రి పొలం పనులకు వెళ్తున్న సమయంలో కోతులు దాడికి పాల్పడ్డాయి. ఈ ఘటనలో కొండల సావిత్రి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను సిరిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మండలంలోని పాత్తంగి, సిరిపురం, బెల్లుపటియా, సోంపేట మండల పరిధిలోని బూషభద్ర గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి స్థానిక ప్రజలను కోతుల బెడద నుంచి రక్షించాలని కోరుతున్నారు.

పేషెంట్ రిలేషన్ అసోసియేట్‌గా ఉద్యోగ అవకాశాలు

శ్రీకాకుళం రూరల్: ఏదైనా డిగ్రీ అర్హత గల వారికి పేషెంట్ రిలేషన్ అసోసియేట్‌గా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు రాగోలు జెమ్స్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్ సెంటర్ హెడ్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.


ఈ ఉద్యోగంలో చేరేందుకు మూడు నెలలు పాటు ఉచిత శిక్షణను ఎచ్చెర్లలోని టీటీడీసీలో ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 7680945337, 7995013422 అనే నంబర్లను సంప్రదించాలన్నారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

కాశీబుగ్గ: మందస మండల జాతీయ రహదారిపై శనివారం పశువులను అక్రమంగా వ్యా నులో తరలిస్తూ ఇద్దరు వ్యక్తులు దొరికారు. ఐచర్ వ్యాన్‌లో 9గేదెలు, నాలుగు గేదె పెయ్యలను తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో శనివారం వేకువజామున పోలీసులు పట్టుకున్నారు. పశువులను బరంపురం నుంచి విజయనగరం జిల్లా అలమండ తరలిస్తున్నట్లు సమాచారం. ఘటనపై మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

అమ్మవారి విగ్రహం ధ్వంసం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని లొద్దపుట్టి ఇలవేల్పు భూలోకమాత అమ్మవారి రాతి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. లొద్దపుట్టి జాతీయ రహదారికి ఆనుకొని ఉన్నత పాఠశాల సమీపంలో గ్రామస్తులు దశాబ్దాల కిందట భూలోమాత అమ్మవారి విగ్రహాన్ని నెలకొల్పి పూజలు చేస్తున్నారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అమ్మవారి విగ్రహం పాదాలను ధ్వంసం చేసినట్లు స్థానికులు గుర్తించారు. గ్రామస్తులంతా దైవంగా పూజలు చేస్తున్న విగ్రహాన్ని విరగ్గొట్టడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.



ధ్వంసమైన అమ్మవారి విగ్రహం పాదాలు

వైఎస్సార్‌సీపీకి ఓటు వేశాడని..

- టిఫిన్ దుకాణం తొలగింపు



బలవంతంగా దుకాణాన్ని తొలగించేందుకు వచ్చిన అధికారులు



రహదారి పక్కన ఉన్న షాపును తొలగించిన దృశ్యం

హిరమండలం: మండలంలోని కల్లటలో ఓ సామాన్యుడిపై అధికార పార్టీ నాయకులు ప్రతాపం చూపించారు. రోడ్డుపక్కన ఉన్న చిన్నపాటి టిఫిన్ దుకాణాన్ని బలవంతంగా తొలగింపజేశారు. బాధితుడు వద్దని వారించినా, బతిమలాడుకున్నా వినకుండా దుకాణాన్ని తొలగించేశారు. కల్లటకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన ఇప్పిలి గిరిబాబు గత కొన్నేళ్లుగా రోడ్డుపక్కన చిన్నపాటి టిఫిన్ దుకాణం ఏర్పాటుచేసుకొని బతుకుతున్నాడు. ఈ దుకాణం రోడ్డుకు అడ్డంకి కాదు. అలాగని స్థానికులు ఎన్నడూ అభ్యంతరం వ్యక్తం చేయలేదు. కానీ ఇటీవల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటువేశాడని అనుమానించిన స్థానిక టీడీపీ నేతలు విషయాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్థానిక తహసీల్దారు వెంకటరమణపై ఒత్తిడి పెంచడంతో ఆయన తక్షణ చర్యలకు ఉపక్రమించారు. శనివారం ఆర్ఐ శంకరరావు, వీఆర్వో సత్యవతి, మరో ఇద్దరు వీఆర్వోలు వెళ్లి దుకాణాన్ని తొలగించారు. దీంతో బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వ స్థలంలో నిర్మించినందుకే తొలగించామని తహసీల్దార్ తెలిపారు.